క్లుప్తంగా

వెల్దండ వైద్యాధికారిగా సింధు



వెల్దండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యాధికారిగా గురువారం సింధు బాధ్యతలు స్వీకరించారు. ఆస్పత్రిలో 6 నెలలుగా డాక్టర్ లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి వెల్దండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెగ్యులర్ వైద్యాధికారిని నియమించారు. ఈ సందర్భంగా డాక్టర్ సింధు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో వైద్య సేవలను అందిస్తామన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవాలన్నారు.

విద్యుత్ ఏడీఈగా శ్రీనివాసులు

నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ విద్యుత్ ఏడీఈ (అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్)గా శ్రీనివాసులు గురువారం సాయంత్రం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఏడీఈగా పనిచేసిన ఆది శేషయ్య రెండు నెలల క్రితం మహబూబ్‌నగర్‌కు బదిలీ కాగా, అప్పటి నుంచి ఆ పోస్ట్ ఖాళీగా ఉంది. దీంతో వనపర్తి స్టోర్ ఏడీగా పని చేసిన శ్రీనివాసులును నాగర్‌కర్నూల్ ఏడీఈగా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించగా, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జగన్



కోడేరు: మండల కేంద్రానికి చెందిన పాండేళ్ల జగన్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ కరీం, ఆదిరాజు, మిద్దె రామకృష్ణ, చామంతిరాజు, తిరుపతి పాల్గొన్నారు.

మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గణేష్ గౌడ్



చారకొండ: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నికల్లో చారకొండ మండల కేంద్రానికి చెందిన ఎరుకలి గణేష్‌గౌడ్ ఎన్నికయ్యారు. సహకరించిన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణకు గణేష్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి

చారకొండ: మండలంలోని జూపల్లిలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన మాడ్గుల హుస్సేన్‌ను గురువారం వెల్దండ యెన్నమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వెల్దండ సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రావు పరామర్శించారు. తలకు తీవ్రంగా గాయాలు కావడంతో పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులతో మాట్లాడారు. వారివెంట వెల్దండ మండల నాయకులు ఉన్నారు.

నేడు, రేపు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో పూజలు

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని వినోబానగర్ కాలనీ ఎర్రగడ్డలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్యేశ్వర షష్టి వేడుకల సందర్భంగా ఈనెల 6, 7 తేదీల్లో పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త జీవీ సుబ్బారావు ఆలయ పూజారి వెంకటేశ్వర శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ వ్యవస్థాపన ధర్మకర్త భూదాన సుబ్బారావు గారి స్వగృహం శ్రీనగర్‌కాలనీ నుంచి దేవాలయం వరకు మేళతాళాలతో స్వామి ఊరేగింపు, పల్లకీ సేవ ఉంటుందని తెలిపారు. వల్లి దేవసేన సమేతసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఉంటుందని ఆలయ చైర్మన్ రామన్‌గౌడ్ తెలపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చారకొండ: చారకొండ మండలంలోని జూపల్లి గ్రామం సమీపంలో బుధవారం రాత్రి జడ్చర్ల – కోదాడ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ శంషొద్దీన్ వివరాల ప్రకారం.. మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన మాడ్గుల హుస్సేన్ కల్వకుర్తి గురుకుల కళాశాలలో గెస్టు లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని కల్వకుర్తి నుంచి జూపల్లికి వస్తుండగా రోడ్డు మధ్యలో ట్రాక్టర్, ట్రాలీ ఉండడంతో వెనక నుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో హుస్సేన్ తలకు, ముఖంపై తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలం చేరుకొని క్షతగాత్రుని చికిత్సనిమిత్తం ప్రైవేట్ వాహనంలో వెల్దండ సమీపాన యెన్నమ్స్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూసంరక్షణపై అవగాహన కల్పించాలి



ఉప్పునుంతలలో భూసార పరిరక్షణపై రైతులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వ్యవసాయాధికారులు



కుడికిల్లలో మట్టి నమూనాలతో రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి

సాక్షి, నెట్‌వర్క్: కొల్లాపూర్ మండలంలోని కుడికిల్లలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదికలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి చిన్న ఉస్సేన్ నేల ప్రాముఖ్యత, భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణ విధానంపై అవగాహన కల్పించారు.

■ ఉప్పునుంతల మండలంలోని ఏడు క్లస్టర్లలో ఉన్న రైతు వేదికలలో రైతులకు నేలతల్లి విశిష్టతను వ్యవసాయాధికారులు వివరించారు. భూసార పరిరక్షణపై రైతులతో ప్రతిజ్ఞ చేయించారు.

■ తిమ్మాజిపేట మండలంలోని మారేపల్లి, పోతిరెడ్డిపల్లి, కోడుపర్తి, తిమ్మాజిపేట, తదితర 7క్లస్టర్‌లలో నేల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు.

■ వెల్దండ మండల కేంద్రంలోని సింగల్‌విండో కార్యాలయ ఆవరణలో మండల వ్యవసాయ అధికారిణి శోభారాణి రైతులకు భూసారం పెంపుపై అవగాహన కల్పించారు.

■ బిజినేపల్లి ప్రతి రైతు మూడు సంవత్సరాలకు ఒకసారి వ్యవసాయ భూమి మట్టి పరీక్షలు చేయాలని పాలెం ఆర్ఏఆర్ఎస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సత్యనారాయణ తెలిపారు.

■ చారకొండ మండలంలోని జూపల్లి, సిర్సనగండ్ల, గోకారం, తిమ్మాయిపల్లి క్లస్టర్‌లలో రైతులకు అవగాహన కల్పించారు.

■ తెలకపల్లిలో వ్యవసాయ శాఖ పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో లక్నారం రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పించారు.

■ లింగాల మండలంలోని సూరాపూర్ రైతు వేదికలో ప్రపంచ నేల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి



పెద్దకొత్తపల్లిలో రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ జగ్గునాయక్

పెద్దకొత్తపల్లి: రైతులు పొలాలో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంపొందించాలని కొల్లాపూర్ ఏడీ జగ్గునాయక్ అన్నారు. పెద్దకొత్తపల్లి రైతు వేదికలో గురువారం ప్రపంచనేల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో నాణ్యత లేని పురుగుల మందులు అమ్ముతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన దృష్టికి తెచ్చారు. రైతులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఎరువుల దుకాణాలలో తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల దుకాణాలలో పురుగుల మందులు, ఎరువులు కొన్నప్పుడు దుకాణాల నుంచి తప్పనిసరిగా రశీదులు పొందాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఓ శిరీష, ఏఈఓ ముజీబ్ పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడుకుందాం



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న కోనేరు సంస్థ నిర్వాహకులు శ్రీనివాసులు

తెలకపల్లి: బాలల హక్కులను కాపాడాకుందామని కోనేరు సంస్థ ఏరియా కో ఆర్డినేటర్ ఎం శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని రాకొండ గ్రామంలో బాలల హక్కులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలు అక్రమ రవాణాకు గురి కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలలపై దాడులు, అఘాయిత్యాలు జరగకుండా పోరాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కోనేరు సంస్థ మొబిలైజర్ రజిత, అంగన్‌వాడీ కార్యకర్త వసంత, కృష్ణయ్య, చంద్రమ్మ, నిరంజన్, గోవర్ధన్‌రెడ్డి, సహస్ర, కమలమ్మ, నారమ్మ, రామచంద్రమ్మ, రాజు, రమేష్, అలివేల పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు



వెల్దండలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం పీడీఎస్‌యూ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు సంతోష్ తెలిపారు. క్రీడలకు మండలంలోని ప్రభుత్వం పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఖో–ఖో, వాలీబాల్, 100మీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్‌రావు, సింగల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు, మాజీ ఉపసర్పంచ్ రాజునాయక్, హెచ్ఎం రవీందర్, రాజేందర్‌రెడ్డి, నాయకులు రాహుల్ నాయక్, శంకర్‌నాయక్, భీరయ్య, మల్లేష్ ఉన్నారు.

నర్సరీల పరిశీలన

తాడూరు: మండలంలోని మేడిపూర్, ఆకునెల్లికుదురు నర్సరీలలో ఏపీఓ చంద్రసిద్ధార్థ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీ నిర్వాహకులకు కవర్లలో మట్టి నింపే విధానం, సారవంతమైన మట్టిని ఎంపిక చేసే ప్రక్రియ, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సాంకేతిక సహాయకులతో పాటు పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు భాగస్వాములు కావాలన్నారు.

సేంద్రియ ఎరువులపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

తాడూరు: గ్రామీణ ప్రాంత రైతులు రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడేవిధంగా దృష్టి పెట్టాలని కేవీకే పాలెం పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డా విజయలక్ష్మి, డా దివ్యలు తెలిపారు. గురువారం మండలంలోని ఇంద్రకల్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ పాలెం పరిశోధన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు నేల ప్రాముఖ్యత, నేలను సంరక్షించడంలో తీసుకోవాల్సిన పద్ధతులు, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు 2 ఏళ్లకు ఒకసారి మట్టిని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపి నేలలో పోషకాల లభ్యతను తెలుసుకొని సిఫారసుకు అనుగుణంగా ఎరువులను వాడాలని వారు సూచించారు. సమావేశంలో ఓ సందీప్‌కుమార్, ఏఈఓ శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాధికారికి సన్మానం

నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాధికారిగా పదవీ బాధ్యతలు తీసుకున్న రమేష్‌కుమార్‌ను పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు గురువారం వారి ఛాంబర్‌లో కలిసి సన్మానించారు. జిల్లాలో విద్యా వ్యాప్తికి కృషి చేయాలని డీఈఓను కోరారు.

తవ్వకాలను అడ్డుకున్న అధికారులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని ఎల్లికల్ తండాలోని కోటగుట్టపై అనుమతి లేకుండా నిర్వహిస్తున్న తవ్వకాలను గురువారం అధికారులు అడ్డుకున్నారు. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు బృందం కోటగుట్టను సందర్శించింది. అక్కడ జరుగుతున్న తవ్వకాలు, బ్లాస్టింగ్ తదితర విషయాలతో పాటు అనుమతులపై ఆరా తీశారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేసి తవ్వకాలకు ఉపయోగిస్తున్న సామగ్రిని సీజ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇబ్రహీం, ఏ నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డి, మైనింగ్ ఆర్ఐ నాగచైతన్య ఉన్నారు.

నాగమణి హత్య దురదృష్టకరం



అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పోలీసు నాగమణి కులాంతర వివాహం చేసుకోవడం వల్లే ఆమె సోదరుడు హత్య చేశాడని, ఇది కులదురహంకార హత్యగా ప్రభుత్వం భావించి తక్షణమే నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. గురువారం అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం రాయపోలు గ్రామానికి చెందిన నాగమణి నవంబర్ 10న యాదగిరిగుట్టలో శ్రీకాంత్‌ను కులాంతర వివాహం చేసుకుంది. దీంతో ఆమెకు ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ఆరోపించారు. గతంలోనూ ఇలాంటి హత్యలు జరిగాయని, చట్టపరంగా కఠిన శిక్షలు విధించకపోవడం వల్లే పునరావృతం అవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు శ్రీనివాస్, రాములు, కృష్ణ, చంద్రయ్య పాల్గొన్నారు.

ఆటోల బంద్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: 7న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన ఆటో, క్యాబ్, టాటా ఏసీల బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను పట్టణంలో పబ్లిక్, ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు పొదిల రామయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల వారి జీవితాలు రోడ్డున పడ్డాయని, ప్రభుత్వం వారికి ఇస్తామన్న రూ.12వేల జీవనభృతి ఇప్పటికీ ఇవ్వలేదని ఆరోపించారు. తక్షణం వారికి జీవనభృతి ఇవ్వాలని, 2019 మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటోల అడ్డా కార్యదర్శి బాలస్వామి, కుమార్, ఎల్లయ్య, ఆంజనేయులు, అనిల్ కుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

■ తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని 7న బంద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ



అంబట్‌పల్లిలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో నిర్వహిస్తున్న వివిధ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో నంది, సీతారాములు, శ్రీకృష్ణ, శివలింగం విగ్రహాలను ప్రతిష్ఠించుటకు అన్ని ఏర్పాట్లు చేశారు.

రేవంత్‌రెడ్డి సర్కార్‌పై బీజేపీ చార్జిషీట్

కల్వకుర్తిరూరల్: రాష్ట్రంలో ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి వంద రోజుల్లో అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంవత్సరం దాటినా, హామీలను అమలు చే యడంలో విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకులు ఆచారి ఆరోపించారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జిషీట్‌ను విడుదల చేశారు. సమావేశంలో శేఖర్‌రెడ్డి, దుర్గా ప్రసాద్, హరిప్రసాద్, రాంచంద్రారెడ్డి, శ్రీనివాసులు, నర్సింహ, సురేందర్‌గౌడ్, శ్రీకాంత్ సింగ్, రాంపాల్ నాయక్, దుర్గయ్య పాల్గొన్నారు.

మూడో ర్యాంకు సాధించిన మల్లేష్



తెలకపల్లి: మండల కేంద్రంలో సంగిశెట్టి మల్లేష్ జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించాడు. బుధవారం సాయంత్రం వెలువడిన టీఎస్‌పీఎస్సీ పోస్టుల్లో భాగంగా జూనియర్ లెక్చరర్ ఫలితాలలో సంగిశెట్టి మల్లేష్ రాష్ట్రంలో మూడో ర్యాంకు సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించి విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు మల్లేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కల్వకుర్తిరూరల్: మండలంలోని లింగసానిపల్లిలో తెలుగు ఉపాధ్యాయుడు మహేష్ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. గురువారం పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసి మహేష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.



నాణ్యమైన భోజనం అందించాలి

తెలకపల్లి: గురుకుల పాఠశాలలో మెరుగైన విద్యతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని బీఆర్ఎస్‌వీ సమన్వయకర్త అతినారపు విష్ణు అన్నారు. గురువారం మండల కేంద్రంలో గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. బీఆర్ఎస్ నాయకులు స్వామి, చందు, రామకృష్ణ, శివశంకర్, విష్ణు, ధర్మరాజు, వినోద్, శ్రీకాంత్, ప్రశాంత్, చైతన్య, అఖిల్ పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ నమోదు



పెద్దకొత్తపల్లిలో సమగ్ర కుటుంబ సర్వే ఫామ్స్‌ను నమోదు చేస్తున్న ఆపరేటర్లు

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం గత నెల 9 నుంచి 25వ తేదీ వరకు చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఫామ్స్ డేటా నమోదు కార్యక్రమం గురువారం ముగిసిందని ఎంపీడీఓ నాగేందర్ తెలిపారు. మండలంలోని 25 గ్రామాల్లో 15,175 కుటుంబాలను సర్వే చేయగా, ఆ కుటుంబాలన్ని ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. సూపర్‌వైజర్‌లు, ఎన్యుమరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్సీకి మున్సిపల్ కార్మికుల కృతజ్ఞతలు



ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డికి పుష్పగుచ్ఛంతో కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డికి మున్సిపల్ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. తమకు రావాల్సిన పెంచిన వేతనాలు, బకాయి పడ్డ ఏరియర్స్‌ను ఇప్పించడంలో ఎమ్మెల్సీ ఎంతో కృషి చేశారని కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, మున్సిపల్ కార్మికులు తెలిపారు.

విశ్వకర్మ జిల్లా కమిటీ ఎన్నిక

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలో గురువారం విశ్వకర్మ సంక్షేమమే ధ్యేయంగా ఏర్పడిన అఖిలభారత విశ్వకర్మ మహాసభ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి గుండోజు గంగాధర్ పర్యవేక్షణలో ఈ కమిటీని ఎంపిక చేశారు.

రైతులకు స్ప్రింక్లర్ల పంపిణీ

కోడేరు: మండల కేంద్రంతో పాటు తుర్కదిన్నె, సింగాయిపల్లి, మాచుపల్లి ఆయా గ్రామాల రైతులకు ప్రభుత్వం నుంచి మంజూరైన స్ప్రింక్లర్ పైపులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాండేళ్ల సురేష్ యాదవ్, చామంతిరాజు, తిరుపతయ్య, ఆదిరాజు, వీరస్వామి, ప్రశాంత్, పురేందర్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూత

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన శేఖర్‌యాదవ్ ఇటీవల మృతి చెందాడు. అంతకు ముందు 3 ఏళ్ల క్రితం ఆయన భార్య చనిపోవడంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. ఆ పిల్లలకు కురుమయాదవ సంఘం నాయకులు అండగా నిలిచారు. గురువారం బాధితులను పరామర్శించి రూ. 50వేల చెక్కు, 50కేజీల బియ్యం అందజేశారు.పిల్లల చదువుకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపతయ్య, కృష్ణయ్య, పర్వతాలు, మల్లేష్, సత్యం, కొండల్ పాల్గొన్నారు.

డాక్టర్‌గా బాధ్యతల స్వీకరణ

తెలకపల్లి: నూతన డాక్టర్‌గా మండలంలోని రాకొండ గ్రామానికి చెందిన నాగేశ్వరి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల వెలువడిన ఫలితాలలో మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించారు. గురువారం బొప్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు.



ఆరోగ్య కేంద్రంలో మొక్క నాటుతున్న డాక్టర్ నాగేశ్వరి

మహిళ అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ అదృశ్యం కావడంతో గురువారం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. ఈనెల 3న మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన తిరపతమ్మ తన ఇద్దరు చిన్నారులను తీసుకుని ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు, బంధువులతో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో గురువారం కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ పోటీలు

- 7, 8 తేదీల్లో గ్రామ స్థాయిలో..
- 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో..
- 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో..
- 27 నుంచి జనవరి 2 వరకు రాష్ట్ర స్థాయిలో..



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న ఆర్డీఓ సురేష్



క్రీడలపై సమావేశం నిర్వహించిన ఎంపీడీఓ మోహన్‌లాల్

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన సీఎం కప్ పోటీలను ప్రతిష్టాత్మకంగా నాగర్‌కర్నూల్ మండలంలో నిర్వహించాలని ఆర్డీఓ సురేష్ ఎంపీడీఓలకు, తహసీల్దార్‌కు సూచించారు.

● పెద్దకొత్తపల్లి మండలంలోని గ్రామాల్లో 7, 8 తేదీల్లో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేందర్ తెలిపారు. ఈ పోటీలలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

● బల్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాఘవులు అధికారులతో సీఎం కప్ పోటీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

● ఉప్పునుంతలలో సీఎం కప్ పోటీలకు క్రీడాకారులను సన్నద్ధం చేయాలని ఎంపీడీఓ మోహన్‌లాల్ సూచించారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు మండల స్థాయిలో, విజేతలకు 16 నుంచి 21వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయని తెలిపారు. ఈనెల 27 నుంచి 2025 జనవరి 2వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అడవికి నిప్పు-మానవాళికి ముప్పు



లింగాల: అడవులను, వన్యప్రాణులను కాపాడుకోవడం మనందరి బాధ్యతగా గుర్తించాలని అటవీ శాఖ బీట్ ఆఫీసర్ ఖాదర్‌పాష అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎర్రపెంటలో అడవుల రక్షణపై చెంచులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీట్ ఆఫీసర్ మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో అడవికి నిప్పు పెట్టడం మానుకోవాలని ఆయన చెంచులకు సూచించారు. ఎవరైనా అడవిని దహనం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు.